www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు: 08 వెల : రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 7288825681

published from : Karimnagar, circulated to : Hyderabad, Karim nagar, Warangal, Khammam, Nalgonda, Mahabub nagar | హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 130 | సోమవారం | 21.10.2024

# నేటి నుంచే గ్రూప్-1 పరీక్షలు

**మెయిన్స్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు**

**ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో 46 పరీక్షా కేంద్రాలు**

**పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధింపు**

**అశోక్ నగర్‌లో ఆగని నిరుద్యోగుల ఆందోళనలు**

**పరీక్షల వాయిదాకు, జీవో 29 రద్దుకు డిమాండ్**

**భారీగా మోహరించిన పోలీసులు**



**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్రంలో నేటి నుంచి ప్రారంభంకానున్న గ్రూప్1 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందుకోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి 27 వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. ఈ పరీక్షలను గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన 31,383 మంది అభ్యర్థులు రాయనున్నారు. ఇప్పటికే 90 శాతం మంది అభ్యర్థులు తుది పరీక్షల కోసం హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 46 పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేశారు. హైదరాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డి జిల్లాలో 11, మేడ్చల్

మిగతా 2లో..

## హిందువుల విషయంలో కాంగ్రెస్ వివక్ష

### ఆలయాల దాడులను సీఎం ఎందుకు ఖండించలేదు?



**నిరసన చేసిన వారిపై దాడులు దారుణం**

**కనీసం నిరసన తెలిపే హక్కు లేదా?**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధ్వజం**

**ఎన్నికల ముందు అశోక్ నగర్ వెళ్లిన రేవంత్ ఇప్పుడు వెళ్లరా?**

**ఏం చేశారని లాఠీచార్జ్ చేశారంటూ ఆగ్రహం**

**త్వరలో హైదరాబాద్ నుంచి యాదాద్రికి ఎంఎంటీఎస్**

**దానికి సంబంధించిన నిర్మాణ పనులు త్వరలో చేపడతాని వెల్లడి**

2



## దేశానికి రోల్ మోడల్ హైదరాబాద్ అవ్వాలి

**న్యూయార్క్, పారిస్ లాంటి నగరాలతో పోటీ పడాలి**

**రిస్క్ చేస్తేనే సక్సెస్ సాధ్యం : సీఎం రేవంత్ రెడ్డి**

**తెలంగాణ ఎకానమీ టార్గెట్ ట్రిలియన్ డాలర్స్**

**600 బిలియన్ డాలర్ సిటీగా హైదరాబాద్ కావాలి**

**ఇది కష్టమే కానీ అసాధ్యం కాదు**

**విద్యార్థులు చదువుతో పాటు పాలిటిక్స్‌లోనూ రాణించాలి**

**త్యాగాలు చేయకుండా గొప్ప నాయకులం కాలేం**

**ఐఎస్‌బీ లీడర్ షిప్ సమ్మిట్ 2024లో సీఎం కామెంట్స్**

**జీవో 317పై నివేదిక అందజేసిన కేబినెట్ సబ్ కమిటీ**

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో :** ఎవరైనా సరే గొప్ప పనులు చేయడానికి రిస్క్ తీసుకోవాలని, రిస్క్ తీసుకోకుండా కొన్ని సాధించలేమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గొప్ప నాయకులుగా ఎదగాలంటే కొన్నిసార్లు త్యాగం చేయడానికి కూడా సిద్ధంగా ఉండాలన్నారు. అలాంటి వారే గొప్పగా ఎదగగలరని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఇండియన్ బిజినెస్

మిగతా 2లో..



2

## ఏడాదిలోనే రైతుల కోసం రూ.50 వేల కోట్లు ఖర్చు

- హామీల అమలులో ఎక్కడా రాజీ పడలేదు
- డిసెంబర్ 9 నాటికి పూర్తిసాయి రుణమాఫీ చేస్తాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



## వారణాసిలో అవినీతి, కుంభకోణాలే ఉండేవి

- బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలే కారణం
- ఇప్పుడా పరిస్థితి మారింది
- కాంగ్రెస్, సమాజ్‌వాదీలపై ప్రధాని ఫైర్
- వారణాసిలో రూ. 6,700 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ప్రధాని

2

## పంతాలకు పోకుండా జీవో 29 ఉపసంహరించుకోవాలి



**ఇది రాజ్యాంగ స్ఫూర్తికి, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు వ్యతిరేకం**

**ఈ జీవోతో 5వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు అనర్హులయ్యారు**

**గ్రూప్-1 పరీక్ష రీ షెడ్యూల్ చేయాలి**

**రేవంత్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ**

2



2

## రైతు భరోసాపై బీఆర్ఎస్ పోరుబాట

- కేటీఆర్ పిలుపుతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, రాస్తారోకోలు
- కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు
- సీఎం రేవంత్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిష్టి బొమ్మలు దహనం
- తక్షణం రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్

## సీఎం 25 సార్లు ఢిల్లీకి వెళ్లి 25 పైసలు తేలే



**11 నెలల్లో ఒక్క మంచి పని అయినా చేశారా?**

**మంత్రిగా కూడా అనుభవం లేనిది ఏం చేయరు**

**ఖరీఫ్ రైతు భరోసా ఎగగొడుతున్నామని సిగ్గు లేకుండా చెప్తున్నారు**

**ఫార్మాసిటీ, ఫోర్త్ సిటీలపై రేవంత్ రెడ్డివి దొంగమాటలు**

**నా ఇళ్లు కూలగొడితే నీ కళ్లు చల్లబడుతాయంటే కూలగొట్టు**

**గల్లీగల్లీ తిరిగి కాంగ్రెస్ సర్కార్ మోసాలు వివరిస్తాం : కేటీఆర్**

**ప్రజానావ, ఖైరతాబాద్:** కాంగ్రెస్ వాళ్లు అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, వాళ్ల పాలనలో ఈ సారి దసరా దసరా లెక్క లేదు, బతుకమ్మ, వినాయక చవితి పండుగలు గతంలో మాదిరిగా జరగలేదని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. రెండు పంటలకు కాదు



## మూసీ బాధితులకు గచ్చిబౌలిలో ఇండ్లు కట్టివ్వాలి

**ఒక్కొక్కరికి 250 గజాల స్థలం కేటాయించాలి**

**మల్లన్న సాగర్, కొండపోచమ్మ బాధితులకు అన్ని వసతులతో డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కట్టిచ్చాం**

**వారిపై కాంగ్రెస్ కపట ప్రేమ చూపిస్తోంది**

**అబద్ధాలకు అంబాసిడర్ సీఎం రేవంత్ రెడ్డి**

**మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజం**

2

# దేశానికి రోల్ మోడల్ హైదరాబాద్ అవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

స్కూల్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. తమ ప్రభుత్వం చేస్తున్న కృషి.. కావాల్సిన సహకారం వంటి వాటిపై మాట్లాడారు. ఐఎస్‌బీ విద్యార్థులు తనకు సహకరించాలని.. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'ఐఎస్‌బీలో చదువుకుంటున్న మీరంతా తెలివైనవారు. అసాధారణ విద్యార్థులు. కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన వారసత్వం ఉంది. గాంధీ మొదలుకుని మన్మోహన్ సింగ్ వంటి నాయకులే ఉదాహరణ. ఎంతటి గొప్ప నాయకుడికైనా ధైర్యం చాలా ముఖ్యం. తెలివితేటలు, నైపుణ్యం, కష్టపడి పనిచేయడంతో పాటు కొన్నిసార్లు అదృష్టం కూడా అవసరం' అని తన జీవితం గురించి రేవంత్ రెడ్డి తెలిపారు.

**600 బిలియన్ డాలర్ల నగరంగా మార్చాలి..**

ప్రజలతో నిత్యం నేరుగా సంబంధాలు పెట్టుకోవాలని, పేదలు, ధనికులు ,చిన్నా, పెద్ద భేదం లేకుండా సమాన గౌరవం ఇస్తు స్నేహ భావంతో అందరిని కలుపుకుపోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రజలతో నిత్యం సంబంధాలు పెట్టుకుంటే మీరు ఏదైనా సాధించగలరని అన్నారు. ఐఎస్‌బీ విద్యార్థులుగా హైదరాబాద్, తెలంగాణతో పాటు న్యూ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌లు అని అభివర్ణించారు. తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల జీడీపీ ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. ఆ లక్ష్యాన్ని చేరుకోవాలంటే హైదరాబాద్‌ను 600 బిలియన్ డాలర్ల నగరంగా మార్చాలని వివరించారు. తెలంగాణను ప్రపంచంలోని ప్రతి భాగానికి తీసుకెళ్లడానికి మీ సహాయం కావాలన్నారు. మీరు ఎక్కడికి వెళ్లినా పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు, సామాన్య ప్రజలతో తెలంగాణ, హైదరాబాద్ గురించి మాట్లాడండని సూచించారు. దేశంలోని ఇతర నగరాలతో కాకుండా న్యూయార్క్, లండన్, పారిస్, టోక్యో , సియోల్ వంటి నగరాలతో హైదరాబాద్ పోటీపడాలని కోరుకుంటున్నానని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోనే భారతదేశం, హైదరాబాద్ అత్యుత్తమంగా మారాలన్నది పెద్ద లక్ష్యమని, కానీ అది అసాధ్యం కాదని పేర్కొన్నారు. తన ప్రభుత్వంతో రెండు, మూడేళ్లు కలిసి పనిచేయాలని కోరారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నామని, గచ్చిబౌలిలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దక్షిణ కొరియాలో స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించానని, అంతటి చిన్న దేశం ఒలింపిక్స్‌లో అనేక పతకాలు సాధించింది. మన దేశం మాత్రం ఒక్క బంగారు పతకం సాధించలేకపోయిందని, తన లక్ష్యం ఒలింపిక్స్‌లో మనం పతకాలు సాధించడమని తెలిపారు.

**జీవో 317పై సీఎంకు నివేదిక..**

జీవో 317పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ వేగం పెంచింది. కమిటీ రూపొందించిన నివేదిక పత్రాలను సీల్డ్ కవర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అందజేసింది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన సభ్యులు, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, పలువురు మేధావులతో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అభిప్రాయాలను వినతుల రూపంలో ప్రత్యక్షంగా, వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను కేబినెట్ సబ్ కమిటీ స్వీకరించింది. సమస్యల పరిష్కారానికి కేబినెట్ సబ్ కమిటీ వివిధ శాఖల ఉన్నతాధికారులతో పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించి తుది నివేదిక పత్రాలను రూపొందించింది. ఈ నివేదిక పత్రాలను సీల్డ్ కవర్‌లో రేవంత్ రెడ్డికి మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి అందజేసింది.

# నేటి నుంచే గ్రూప్-1 పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలను కేటాయించారు. అన్ని కేంద్రాల వద్ద ఎలాంటి అవకతవకలు, అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించనున్నారు.

**పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్..**

ఇప్పటికే పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పోలీస్ కమిషనర్లతో ప్రభుత్వం తగిన బందోబస్తు ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాల వద్ద స్వల్ప సంఘటనలు జరుగకుండా అత్యంత అప్రమత్తంగా పరీక్షల నిర్వహణ నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. 2011 సంవత్సరం తర్వాత గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు సోమవారం నుంచి జరగనున్నాయి. ప్రతి పరీక్ష హాల్, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాలన్నింటిలోనూ సీసీ టీవీలను ఏర్పాటు చేశారు. టీజీపీఎస్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా సీసీలను పోలీసులు పర్యవేక్షిస్తారు.

**మళ్లీ రోడ్డెక్కిన గ్రూప్-1 అభ్యర్థులు..**

గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనలతో అశోక్ నగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు అలాగే కొనసాగుతున్నాయి. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయడం, జీవో 29 రద్దు వంటి డిమాండ్లతో శుక్రవారం అభ్యర్థులు అశోక్ నగర్‌లో ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఆందోళనలో పాల్గొన్న అభ్యర్థులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఆదివారం కూడా ఉదయం నుండే భారీ సంఖ్యలో గ్రూప్ 1 అభ్యర్థులు అశోక్ నగర్ చేరుకుని ధర్నాకు దిగారు. హాల్ టికెట్స్, ప్లకార్డ్స్ చేతపట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేశారు. ప్రెస్ మీట్ పెట్టి మీడియాతో మాట్లాడబోగా ప్రెస్ మీట్‌కి అనుమతి లేదంటూ పోలీసులు అభ్యర్థులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, విద్యార్థులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

# జీవో 29 ఉపసంహరించుకోవాలి

- ఇది రాజ్యాంగ స్ఫూర్తికి, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు వ్యతిరేకం
- ఈ జీవోతో 5వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు అనర్హులయ్యారు
- గ్రూప్-1 పరీక్ష రీ షెడ్యూల్ చేయాలి
- రేవంత్ కు కేంద్ర మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ

ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో :

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంతాలు, పట్టింపులకు పోకుండా జీవో 29ని ఉపసంహరించుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు. ఈ మేరకు ఆయన బహిరంగ లేఖ రాశారు. 'సోమవారం నుంచి పరీక్షలని తెలిసి కూడా ఆందోళనలు కొనసాగిస్తున్నారంటే అర్థం చేసుకోండి. నిరుద్యోగులంతా మీ కుటుంబ సభ్యులుగా భావించి వారి ఆవేదన అర్థం చేసుకోండి. వెంటనే గ్రూప్ 1 పరీక్ష రీ షెడ్యూల్ చేయండి. జీవో 29 వల్ల గ్రూప్1 పరీక్షల్లో 5,003 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు అనర్హులయ్యారు. 563 పోస్టులకు 1:50 చొప్పున అభ్యర్థులను ప్రకటించడం అన్యాయం. ఈ మొత్తం పోస్టుల్లో 354 రిజర్వు పోస్టులు. జీవో 29 వల్ల ఓపెన్ కేటగిరిలో అర్హత సాధించిన రిజర్వ్ అభ్యర్థులను సైతం రిజర్వ్ కేటగిరిలో చేర్చడం అన్యాయం. ఈ జీవో వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యర్థులు 1:50 చొప్పున అర్హత సాధిస్తే.. ఓసీ వర్గాలు 1:65శాతం మేర అర్హత సాధించాయి. జీవో 29 రాజ్యాంగ స్ఫూర్తికి, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు వ్యతిరేకం. గ్రూప్1 అభ్యర్థులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు. పరీక్షలు రీ షెడ్యూల్ చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమని వాపోతున్నారు. జీవో 29 వల్ల రాష్ట్రంలో మొత్తం రిజర్వేషన్ల వ్యవస్థనే రద్దు చేయబోతున్నారనే చర్చ మొదలైంది. తక్షణమే జీవో 29 ఉపసంహరించుకోవాలి' అని బండి సంజయ్ లేఖలో పేర్కొన్నారు.

# మూసీ బాధితులకు గచ్చిబౌలిలో ఇండ్లు కట్టివ్వాలి

- ఒక్కొక్కరికి 250 గజాల స్థలం కేటాయించాలి
- మల్లన్న సాగర్, కొండపోచమ్మ బాధితులకు
- అన్ని వసతులతో డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కట్టిచ్చాం
- వారిపై కాంగ్రెస్ కపట ప్రేమ చూపిస్తోంది
- అబద్దాలకు అంబాసిడర్ సీఎం రేవంత్ రెడ్డి
- మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజం

ప్రజానావ, గజ్వేల్:

ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులపై కాంగ్రెస్ కపట ప్రేమ చూపిస్తోందని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆరోపించారు. ఆదివారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిదని, దానిని దృష్టిలో పెట్టుకుని ఇచ్చిన హామీ మేరకు రెండు పడక గదుల ఇండ్లు, ఇంటి స్థలాలు, వివిధ ప్యాకేజీలు వర్తింపజేసినట్లు స్పష్టం చేశారు. అయితే మల్లన్న సాగర్ , కొండపోచమ్మ బాధితుల పాత ఇండ్లకు రూ.694 కోట్లు, అలాగే ఇంటి యజమానికి ఉపాది కింద రూ.7.50 లక్షల ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ఇంట్లో 18 ఏళ్లు నిండిన పెళ్ళికాని పిల్లలకు రూ.5 లక్షల చొప్పున ఇవ్వగా, దేశంలో ఇలాంటి ప్యాకేజీలు ఎక్కడ వర్తింపజేయలేదని తెలిపారు. ముఖ్యంగా నిర్వాసితులకు గజ్వేల్ నడిబొడ్డున విలువైన ప్రదేశాన్ని గుర్తించి సకల వసతులతో కూడిన డబల్ బెడ్రూమ్ ఇండ్లు కేటాయించగా పెళ్ళికాని పిల్లలకు 250 గజాల ఖాళి స్థలం మంజూరీ చేసినట్లు గుర్తు చేశారు. కాగా ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి మూసి ప్రక్షాళన పేరిట ఇండ్లు కూల్చి కెసిఆర్ కట్టించిన ఇండ్లు ఇవ్వడం సిగ్గుచేటని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డికి నిర్వాసితులపై ప్రేమ ఉంటే కెసిఆర్ లాగా సకల వసతులతో కూడిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసి సుందరీకరణలో భాగంగా బాధితులకు గచ్చిబౌలిలో 250 గజాల స్థలంలో ఇల్లు కట్టి ఇవ్వాలని అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో కేసీఆర్ నిర్వాసితులకు అన్యాయం చేసిండో? లేక మూసి ప్రక్షాళనలో సీఎం రేవంత్ రెడ్డి అన్యాయం చేస్తుంటే ప్రజలే గుర్తిస్తారని స్పష్టం చేశారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు 675 ఎకరాలలో ఇండ్లు కట్టించి ఇచ్చిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందని తెలిపారు. మల్లన్న సాగర్ నిర్వాసితులకు ఇండ్లు ఇవ్వలేదని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తుండడం నిజం కాదని, అబద్దాలకే కాంగ్రెస్ అంబాసిడర్ గా మారిందని ఎద్దేవా చేశారు.గజ్వేల్ పట్టణ శివారులో 3414 డబల్ బెడ్రూమ్ ఇండ్లు కట్టించి ఇవ్వగా, చిత్తశుద్ధి ఉంటే సీఎం రేవంత్ రెడ్డి మూసి నిర్వాసితులకు గచ్చిబౌలిలోని 470 ఎకరాలలో ఇండ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే తమ ప్రభుత్వ హయాంలో 8 వేల మంది బాధితులకు 250 గజాల చొప్పున ఇంటి స్థలాలు, నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్రంలో 30 వేల ఇండ్లు కట్టించి ఇవ్వగా, ముంపు గ్రామాల బాధితులకు రూ.2 వేల కోట్లు కేసీఆర్ ఖర్చు చేసినట్లు తెలిపారు.తునికి బొల్లారంలో 400 ఎకరాల్లో భూ నిర్వాసితుల కోసం ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయగా, వర్గల్ లో పరిశ్రమలు రాకుండా కాంగ్రెస్ నేతలు అడ్డు పడుతున్నట్లు పేర్కొన్నారు. నిర్వాసితులను తప్పుదారి పట్టించడం కాకుండా వివిధ కారణాలతో మిగిలిన వారికి నష్ట పరిహారం, ప్యాకేజీలు ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# ఏడాదిలోనే రైతుల కోసం రూ.50 వేల కోట్లు ఖర్చు

- హామీల అమలులో ఎక్కడా రాజీ పడలేదు
- డిసెంబర్ 9 నాటికి పూర్తిసాయి రుణమాఫీ చేస్తాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రైతుబంధు పేరుతో వేల కోట్ల దోచుకోలేదా?
- బీఆర్ఎస్ ధర్నాలకు రైతుల స్పందన లేదని విమర్శలు

ప్రజానావ, ఖమ్మం బ్యూరో :



కేసీఆర్ ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ. 7,600 కోట్లు రైతు బంధు తమ ప్రభుత్వం చెల్లించిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతుబంధు పేరు చెప్పి వ్యవసాయ యాంత్రీకరణ, పంటల బీమా, డ్రిఫ్ ఇరిగేషన్ పథకాలు అటకెక్కించారని ధ్వజమెత్తారు. ఆదివారం మంత్రి తుమ్మల ఖమ్మం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. అధికారంలో ఉన్నపుడు రైతులకు బీఆర్ఎస్ అన్యాయం చేసిందని అన్నారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా రుణమాఫీ చేశామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ధర్నాలకు రైతుల నుంచి స్పందన లేదని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో సాగులో లేని భూములకు కూడా..రైతుబంధు పేరుతో రూ.వేలకోట్ల ప్రజాధనం దోచిపెట్టారని మంత్రి తుమ్మల ఆరోపించారు. సాగులో లేని భూములకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదేళ్లలో రూ.25 వేల కోట్లు ప్రజాధనం దుర్వినియోగం చేసిందని మండిపడ్డారు. మొక్క జొన్న, పత్తి వద్దని రైతులను కేసీఆర్ పాలనలో అయోమయం చేశారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పచ్చి రొట్ట విత్తనాలు సబ్సిడీ చెల్లించక చేతులెత్తేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బకాయిలు చెల్లించిందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులను బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు.

**రూ. 27 వేల కోట్లు రైతుల సంక్షేమానికి ఖర్చు..**

తెలంగాణ రైతులకు బీఆర్ఎస్‌పై విశ్వాసం లేకనే కాంగ్రెస్ పార్టీని గెలిపించారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. వరి సాగుతో ఉరి అని.. సన్నాలు సాగు చేయాలని అన్నారని గుర్తు చేశారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా, వ్యవసాయ యాంత్రీకరణ పథకాలతో రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని అన్నారు. రేవంత్ పాలనలో మొదటి పంట కాలంలోనే రూ. 27 వేల కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు పెట్టామని అన్నారు. సన్న వడ్లకు రూ.500లు బోనస్‌తో ఎకరాకు అదనంగా రూ.8 నుంచి రూ.10 వేల ఆదాయంతో రైతులు వారి కాళ్లపైన వారు నిలబడేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. బీఆర్ఎస్ ధర్నాలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. రైతు సంక్షేమం కోసం బీఆర్ఎస్ నేతలు రాజకీయాలు చేయకుండా..నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. వరంగల్ రైతు డిక్లరేషన్ మీటింగ్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని అమలు చేయడంలో ఎక్కడ రాజీ పడలేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన సోనియమ్మ జన్మదినం డిసెంబర్ 9 నాటికి పూర్తిస్థాయి రైతు రుణమాఫీ చేస్తామని అన్నారు.

# సీఎం 25 సార్లు ఢిల్లీకి వెళ్లి 25 పైసలు తేలే

(మొదటి పేజీ తరువాయి)



మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని రేవంత్ రెడ్డి గతంలో అన్నాడని, కేసీఆర్ ముష్టి రూ. 10 వేలు ఇస్తున్నాడని గుర్తు చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో నిర్వహించిన దసరా సమ్మేళనం అలయ్ బలయ్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చావు కబురు చల్లగా చెప్పిండని, నాట్లు కాదు కోతలు కూడా అయిపోతున్నాయి.. రైతు భరోసా ఏది అంటే.. ఈ ఖరీఫ్ సీజన్ కు పైసలు లేవు అన్నాడని కేటీఆర్ మండిపడ్డారు. 'మహిళలకు తులం బంగారం అన్నాడు... ఏమైంది? గత 11 నెలల్లో 4 లక్షల వివాహాలు జరిగాయి... త్వరలో మరో 2 లక్షల పెళ్లిళ్లు జరగనున్నాయి. ఇప్పటికైనా తులం బంగారం ఇవ్వాలి. ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తానని కూడా చెప్పాడు... ఆడపిల్లలను మోసం చేసినవాడు బాగుపడడు. ఇంట్లో వృద్ధులకు, కోడలికి పించను అన్నాడు... ఒక్కరికైనా ఇచ్చాడా? ఉచిత బస్సు ప్రయాణం అన్నాడు... ఆ ఉచిత ప్రయాణాల్లో ఆడవాళ్లు కొట్టుకునే పరిస్థితి వచ్చింది.


**ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలి..**

రేవంత్ రెడ్డి ఈ 11 నెలల్లో ఒక్క మంచి పని అయినా చేశాడా? మంత్రిగా కూడా అనుభవం లేదు... ఏం చేస్తావంటే ఏముంది... గుంపు మేస్త్రి మాదిరిగా పనిచేస్తా అన్నాడు! ఇప్పుడొచ్చి అందరి ఇళ్లను కూలగొడుతున్నాడు. సోనియా గాంధీని నాడు బలి దేవత అన్నాడు, రాహుల్ గాంధీని ముద్దపప్పు అన్నాడు... కాంగ్రెస్ పార్టీని కుంభకోణాల పార్టీ అన్నాడు... ఇప్పుడు సోనియా గాంధీని దేవత అంటున్నాడు. రెండు పంటలకు కాదు, మూడు పంటలకు రైతు బంధు ఇవ్వాలని రేవంత్ రెడ్డి గతంలో చెప్పాడు. కాంగ్రెస్ వస్తే రూ.15 వేలు ఇస్తాం అన్నాడు. కానీ రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల చావు కబురు చల్లగా చెప్పాడు. రైతు భరోసా ఏదీ అంటే ఈ ఖరీఫ్ సీజన్ కు పైసలు లేవు అన్నాడు. ఖరీఫ్ రైతు భరోసా ఎగ్గొడుతున్నాం అంటూ సిగ్గులేకుండా చెప్పాడు. ఇప్పుడు రుణమాఫీ లేదు, బోనస్ లేదు... రైతు భరోసా రాదు. 25 సార్లు ఢిల్లీ వెళ్లాడు... 25 పైసలు కూడా తెచ్చుకోలేదు. రాష్ట్రమంతా నాశనం చేస్తున్నాడు. అశోక్ నగర్‌లో విద్యార్థులు ఆందోళన చేస్తున్నది సోషల్ మీడియాలో చూస్తున్నాం... కానీ ప్రధాన మీడియాలో చూపించడం లేదు. మరో రెండు నెలలు గడిస్తే ఏడాది అవుతుంది... ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని' డిమాండ్ చేశారు.

# హిందువుల విషయంలో కాంగ్రెస్ వివక్ష

- ఆలయాల దాడులను సీఎం ఎందుకు ఖండించలేదు?
- నిరసన చేసిన వారిపై దాడులు దారుణం
- కనీసం నిరసన తెలిపే హక్కు లేదా?
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధ్వజం
- ఎన్నికల ముందు అశోక్ నగర్ వెళ్లిన రేవంత్ ఇప్పుడు వెళ్లరా?
- ఏం చేశారని లాఠీచార్జ్ చేశారంటూ ఆగ్రహం
- త్వరలో హైదరాబాద్ నుంచి యాదాద్రికి ఎంఎంటీఎస్
- దానికి సంబంధించిన నిర్మాణ పనులు త్వరలో చేపడతాని వెల్లడి

ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో :



హిందూ దేవాలయాల పక్కన మరో మతానికి చెందిన మోటివేషన్ క్లాసులు జరుగుతూ ఉంటే ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. బ్యూటిఫికేషన్ పేరుతో మూసీ ఒడ్డున ఉన్న పేదల ఇండ్లను కూల్చవద్దని ప్రభుత్వానికి సూచించారు. నాంపల్లిలోని స్టేట్ పార్టీ ఆఫీసులో ఆదివారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ విగ్రహం ధ్వంసం విషయమై సికింద్రాబాద్‌లో హిందు కార్యకర్తలు నిరసనలు చేస్తుంటే పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని తప్పుపట్టారు. చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని నిలదీస్తూ నిరసన తెలుపుతున్న హిందూ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జికి పాల్పడడం సహించరానిదన్నారు. హిందువుల విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ విధానాలు ఒక్కటేనన్నారు. ముత్యాలమ్మ దేవాలయం ధ్వంసం విషయంపై హిందూ సంఘాలపై పోలీసుల దౌర్జన్య దమనకాండ, అశోక్‌నగర్‌లో నిరుద్యోగులు, విద్యార్థులపై లాఠీచార్జి కాంగ్రెస్ ప్రభుత్వ అహంకార ధోరణి, దురహంకారానికి నిదర్శనమన్నారు. దేవాలయంలో రక్తాభిషేకం చేస్తారా... హిందు నిరసనకారులు టెర్రరిస్టులా.. అని వ్యాఖ్యానించారు. హిందూ దేవాలయంపై దాడి జరిగితే సీఎం, కాంగ్రెస్ పార్టీ ఎందుకు ఖండించలేదని నిలదీశారు.

**మూసీ సరైన డైరెక్షన్ లేదు..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం అని చెప్పుకుంటున్న మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు సరైన డైరెక్షన్ లేదని, నదిలో కలుస్తున్న పారిశ్రామిక, మానవ వ్యర్థాలను నిలువరించేలా డ్రైనేజీ సిస్టమ్‌ను సరిచేయకుండా నది సుందరీకరణ ఎలా సాధ్యమని అడిగారు. పేద కుటుంబాలు రోడ్డున పడితే బీజేపీ సైలెంట్‌గా ఉండదని, వారి పక్షాన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతుందన్నారు. గ్రూప్1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు మూడు రోజులుగా అశోక్‌నగర్‌లో నిరసనలు, ఆందోళనలు చేస్తున్నారని, జీవో 29 ద్వారా వారికి కలిగే నష్టంపై ఆందోళన చెందుతున్నారని, వారి సందేహాలను నివృత్తి చేయడానికి చర్చలకు పిలవాలని రిక్వెస్టు చేశారు. సీఎం కాకముందు నిరుద్యోగులకు అనేక మాటలు చెప్పినా ఇప్పుడు వారి ఆందోళనలను పట్టించుకోకపోవడాన్ని ప్రస్తావించారు. సెంట్రల్ లైబ్రరీకి వెళ్ళి వారికి ఉద్యోగాల గురించి ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన సీఎం రేవంత్... ఇప్పుడు పోలీసులతో లాఠీచార్జీ చేయించడాన్ని తప్పుపట్టారు.

**హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్..**

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక సదుపాయాలతో తీర్చి దిద్దుతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ పనులను 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఆధునిక సౌకర్యాలతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు అంకితం చేస్తారని కేంద్రమంత్రి తెలిపారు. రూ.430 కోట్లతో కొనసాగుతున్న చర్లపల్లి టెర్మినల్ నిర్మాణ పనులను కిషన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అమృత్ పథకంలో భాగంగా స్థానికంగా ఉన్న అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రూ.430 కోట్లతో చర్లపల్లి, రూ.715 కోట్లతో సికింద్రాబాద్, రూ.429 కోట్లతో నాంపల్లి రైల్వేస్టేషన్‌లలో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రూ.521 కోట్లతో కాజీపేటలో రైల్ మానిఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించినట్లు తెలిపారు. దానికి సంబంధించిన నిర్మాణ పనులు త్వరలో చేపడతామన్నారు.

# రైతు భరోసాపై బీఆర్ఎస్ పోరుబాట

- కేటీఆర్ పిలుపుతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, రాస్తారోకోలు

ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో :

రైతు భరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చడాన్ని నిరసిస్తూ తెలంగాణ వ్యాప్తంగా భారత రాష్ట్ర సమితి శ్రేణులు ఆందోళనకు దిగాయి. వానాకాలం సీజన్ కు సంబంధించిన రైతు భరోసాను ఇవ్వమని, వచ్చే రబీ పంట సీజన్ నుంచి అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేసిన ప్రకటించారు.దీంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి రాస్తారోకోలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. కాంగ్రెస్ సర్కార్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇచ్చిన హామీ మేరకు తక్షణమే రైతు భరోసా అమలు చేయాలని గులాబీ శ్రేణులు డిమాండ్ చేశాయి. కాగా, 'రైతు భరోసా' పథకం కోసం రైతన్నలు ఎదురు చూస్తున్నారు. పంట సాగు కోసం గత ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరాకు రూ.10 వేలు రెండు విడతల్లో ఇచ్చేది. అయితే అదే పథకాన్ని రైతు భరోసాగా మార్చి పంట పెట్టుబడి సాయంగా (ఖరీఫ్, రబీ సీజన్‌లో) ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 10 నెలలు అవుతున్నా.. ఇంకా ఈ పథకం అమల్లోకి రాలేదు. ఈ క్రమంలోనే రైతు భరోసాపై తాజాగా మంత్రి తుమ్మల కీలక అప్డేట్ ఇచ్చారు. తమ ప్రభుత్వంలో మాత్రం కేవలం సాగులో ఉన్న భూములకే రైతు భరోసా నిధులు జమ చేస్తామని స్పష్టంచేశారు. అందుకోసం సబ్ కమిటీ ఏర్పాటు వేసినట్లు తెలిపారు. విధివిధానాలు ఖరారు కాగానే.. రాబోయే పంట కాలం నుంచి రైతు ఖాతాల్లో రైతు భరోసా పంట సాయం అందిస్తామని ప్రకటించారు.



# ఎద్దు ఏడ్చినా ఏవుసం.. రైతులు ఏడ్చిన రాజ్యం బాగుపడదు

## జిల్లా పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

### రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది

### రుణమాఫీ, రైతు భరోసా ఇచ్చే వరకూ కాంగ్రెస్‌ను వదిలేది లేదు

**ప్రజానావ, మెదక్ బ్యూరో:**

రైతు భరోసా ఇవ్వకుండా ఎగొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ తీరుకు నిరసనగా ఆదివారం మెదక్ జిల్లా కేంద్రం రాందాస్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రోడ్డు పై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. ఈ వానకాలం పంటకి రైతు భరోసా కింద ఎకరానికి 7500 తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులు పక్ష నిలబడి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల్లో ఆచరణకు సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ రైతులను నిలువునా మోసం చేస్తోందన్నారు. ఎకరానికి 7,500 రైతులకు పెట్టుబడి సాయం కింద ఇవ్వకుండా రైతులకు కన్నీళ్లు పెట్టిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని విధాలుగా రైతును ఏడిపిస్తున్న కాంగ్రెస్‌కు ఉసురుతప్పదు. కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాం రాం చెబుతున్నారన్న కేసీఆర్ మాటలను రేవంత్‌రెడ్డి సర్కార్ అక్షరాల నిజం చేసిందన్నారు. వానాకాలం పంట సీజన్‌కు రైతుబంధును పూర్తిగా ఎగ్గొట్టేసింది. లక్షలాది మంది రైతుల నోట్లో మట్టి కొట్టింది. ఇప్పుడు స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతులేస్తున్నట్లు ప్రకటించారు. మీ చేతగానీ తనంతో రైతన్నలను మోసం చేస్తామంటే ఊరుకునేలేదు. సబ్ కమిటీ, గైడ్ లైన్స్ అంటూ పెట్టుబడి సాయాన్ని ఎగ్గొడతామంటే రైతులు ఊరుకోరన్నారు. రైతు భరోసాకు డబ్బులు లేకపోవటంతోనే సబ్ కమిటీ అంటూ డ్రామాలు స్టార్ట్ చేశారన్నారు. పచ్చి అబద్దాలు, మోసాలతో రైతులను దగా చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ దగాకోరు మాటలు నమ్మి గెలిపించిన రైతులను అరిగోస పెడుతున్నారన్నారు. రైతులతో చెలగాటమాడితే మాడి మసి అవక తప్పదన్నారు. రుణమాఫీ మోసం చాలదన్నట్లు ఇప్పుడు రైతు భరోసాలోనూ దగానే ఎట్టి పరిస్థితుల్లో రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతి, మాజీ జడ్పీ ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ ఆంజనేయులు, కోకన్వీనర్లు కృష్ణగౌడ్, లింగారెడ్డి, జుబేర్ అహ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు జయరాజ్, ఆర్‌కే శ్రీనివాస్, విశ్వం, సుంకయ్య, మాజీ కౌన్సిలర్లు చంద్రకళ, సలాం, మెదక్ మండల పార్టీ అధ్యక్షులు అంజగౌడ్,





## సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**ప్రజానావ, చిన్న శంకరంపేట:**

రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరుకు నిరసనగా చిన్న శంకరంపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో చేపట్టారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పంటకు రైతు భరోసా కింద ఎకరానికి 7500 చెల్లిస్తామని చెప్పి ఇప్పటివరకు రైతు భరోసాపై ఊసేత్తకపోవడం ఎంతవరకు సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఎకరాకు 7500 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో సాధ్యం కానీ హామీలతో గద్దెనెక్కి నేడు అధికారంలోకి వచ్చాక రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వకుండా కన్నీరు పెట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాజు, ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, గ్రామాల మాజీ సర్పంచులు ఎంపీటీసీలు, రైతు విభాగం నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

**ప్రజానావ, దౌల్తాబాద్:**

పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని రాయపోల్ తాజా మాజీ జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి అన్నారు. ఆదివారం రాయపోల్ మండలం టెంకంపేట గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కార్యకర్త మహేశ్ మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండలం టెంకంపెట్ గ్రామానికి చెందిన యువ కార్యకర్త శేరి మహేష్ అనారోగ్యంతో మృతిచెందడం చాలా బాధాకరమన్నారు. మహేష్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. మహేష్ మృతితో గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి లోటు ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు వారి కుటుంబాలకు ఆపద కాలంలో అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో తిరుపతి కిషన్, నాగులు, నర్సింహులు, రమేష్, రాజు, బాల్‌రెడ్డి, రాజానర్సు, బాలనర్స్, మధు, ఆంజనేయులు, విఠల్ పాల్గొన్నారు.





## వేములవాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

**ప్రజానావ, వేములవాడ:**

ప్రజానావ, వేములవాడ: వర్షాకాలంలో రైతులకు రైతు భరోసా ఇస్తానని ఇవ్వకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు పిలుపుమేరకు ఆదివారం నియోజవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నేతలు నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి బస్టాండ్ వద్ద బిఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రబీ ముగిసినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రైతు భరోసా ఇవ్వకపోవడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రైతు భరోసాపై బీఆర్ఎస్ పోరుబాట

**ప్రజానావ, తూప్రాన్:**

ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఎకరాకు 15000 రైతు భరోసా ఇస్తానని హామీనిచ్చి పది నెలలు దాటిన ఇవ్వడం లేదని వెంటనే రైతు ఖాతాలో రైతుభరోసా వేయాలని రాష్ట్ర మాజీ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. హామీలిచ్చి అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ తూప్రాన్ బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. రైతుల పాలిట శాపంగా మారిన కాంగ్రెస్ ప్రభుత్వంపై త్వరలోనే ప్రజలు తిరగబడతారని అడ్డగోలుగా హామీలిచ్చి పూటకో మాట మార్చి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని మాజీ అటవీశాఖ అభివృద్ధి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు తూప్రాన్‌లో నాయకులతో కలసి ధర్నా నిర్వహించారు. అబద్ధపు అరు గ్యారెంటీలు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. రైతుభరోసా 15,000 ఏకారానికి ఇస్తామని రైతులను మోసం చేసి అసలే ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచిన రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రైతుల ఖాతాలో రైతు భరోసా వేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15 నాడు రైతులకు పూర్తిగా రైతు రుణమాఫీ చేస్తామని దేవుళ్ళపై ఒట్టేసి రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికి పూర్తి స్థాయిలో కాకపోవడం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని త్వరలోనే తగిన బుద్ధి చెప్తారని ధీమా వ్యక్తంచేశారు. ధర్నాలో తూప్రాన్ పట్టణ అధ్యక్షుడు సతీష్ చారి, నాయకులు సత్యనారాయణ, చంద్రారెడ్డి, కృష్ణారెడ్డి మాజీ సర్పంచులు మన్నె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





## బీఆర్ఎస్ నిరసన గళం

**ప్రజానావ, నార్సింగి:**

ఎన్నికల్లో హామీల వర్షం కురుపించిన సీఎం రేవంత్ రెడ్డి రైతులకు నేడు మోసం చేసారని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు మండిపడ్డారు. రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతు భరోసా ఎగవేసిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపు మేరకు ఆదివారం నార్సింగి పట్టణ కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాబు, మాజీ ఎంపీపీ సబితా రవీందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. ఈ వాన కాలం పంటకి రైతు భరోసా కింద ఎకరానికి 7500 తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులు పక్ష నిలబడి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శశిధర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేష్ గౌడ్, సీనియర్ నాయకులు శ్రీపతి రావు, స్వామి, పార్టీ నార్సింగి పట్టణ అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భూపతి రాజు, యూత్ అధ్యక్షుడు సుదీప్ గౌడ్, తాజా మాజీ ఉప సర్పంచ్ యోగి, గ్రామ పార్టీ అధ్యక్షులు లాలం, భాషా నాయక్, అబ్దుల్ వహీద్, పీఏసీఎస్ డైరెక్టర్ బిక్యా నాయక్, తాజా మాజీ సర్పంచ్ లు శ్రీనివాస్, అంబరీష్, మైనారిటీ నాయకుడు ముజీబ్, పార్టీ నాయకులు మోహన్ రెడ్డి, వెంకటేష్, ఓం ప్రకాష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసికోల్లాసం

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**ప్రజానావ, సిరిసిల్ల:**

క్రీడలతో మానసికోల్లాసం ఏర్పడుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.. ఆదివారం సిరిసిల్ల పట్టణంలో కాలేజ్ గ్రౌండ్ లో రాజన్న సిరిసిల్ల ప్రీమియం సీజన్ 2 కాంగ్రెస్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ క్రీడా పోటీలతో మానసికోల్లాసంతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలతో స్నేహభావం పెరగడానికి ఉపయోగపడుతుందన్నారు. తనకు క్రీడలు అంటే ఎంతో ఆసక్తి అని, వాలీబాల్ పోటీల్లో పాల్గొని బహుమతుల సైతం సాధించానని గుర్తుచేశారు. యువత కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడల వైపు ఆసక్తి చూపించాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

యువత సన్మార్గంలో నడిచేందుకు గంజాయి రహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 2036 ఒలింపిక్స్ నాటికి తెలంగాణ నుంచి పతకాలు సాధించాలని ఎలక్షన్ కు ప్రభుత్వం క్రీడా జ్యోతి పాలసీ తయారు చేస్తుందన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అనంతరం క్రికెట్ పోటీల్లో విజయం సాధించిన విజేతలకు బహుమతులను అందజేశారు.

# ఘనంగా వ్యవసాయ అధికారుల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజానావ, శామీర్‌పేట్:**
వ్యవసాయ శాఖలో ప్రస్తుతం పని చేస్తున్న 2600 మంది వ్యవసాయ విస్తరణ అధికారులలో 2100 మంది 2017, 2018 సంవత్సరాలలో నియమితులై తమ ఏడు సంవత్సరాల సర్వీసులు విజయవంతంగా పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా ఆదివారం తుంకుంటలో రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ఏఈవోలు భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గత 7 సంవత్సరాలలో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ తరపున అమలు చేసిన వివిధ ప్రతిష్టాత్మక పథకాలను విజయవంతంగా అమలు చేసినట్టు వ్యవసాయ విస్తరణ అధికారులు చర్చించుకున్నారు. గత ఏడు సంవత్సరాల కాలంలో క్షేత్రస్థాయిలో ఎదురైన చేదు అనుభవాలను, అలాగే కష్టనష్టాల గురించి చర్చించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖలో ప్రతి 5000 ఎకరాలకు ఒకటి చొప్పున వ్యవసాయ క్లస్టర్లను ఏర్పాటు చేసినట్టు చెబుతున్నప్పటికిని క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరే లా వ్యవసాయ విస్తరణ అధికారులు తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కూడా ఏలాంటి ఫలితం లేకుండా పోయింది అని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. రానున్న కాలంలో తమ సమస్యల సాధన కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని తీర్మానం చేసి రాష్ట్రస్థాయిలో కార్యాచరణ కొరకు రాష్ట్రస్థాయి అడ్ హాక్ కమిటీని ఈ సందర్భంగా ఏఈఓలు అందరు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ రాష్ట్ర స్థాయి అడ్ హాక్ కమిటీకి చైర్మన్ గా రాజ్ కుమార్ బాదావత్ , కన్వీనర్లుగా పంజాల రాజు, కల్లేపల్లి పరశురాం, బందేల సుమన్, కళ్యాణిలతో పాటుగా 32 జిల్లాల నుంచి జిల్లా కమిటీ బాధ్యులు కోకన్వీనర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖలో విస్తరణ అధికారులు తీవ్రమైన నిరాశ నిస్పృహలతో పనిచేస్తున్నట్లుగా తెలిపారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సూచనల మేరకు భారతదేశంలో వ్యవసాయ విస్తరణ విజయవంతంగా ముందుకు వెళ్లాలంటే గ్రామస్థాయిలో ప్రతి 750 నుండి 1000 మందికి ఒకరి చొప్పున అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ ఉండాలని కమిటీ సిఫార్సు చేసిందనీ, కానీ దీనికి విరుద్ధంగా తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్రంలో సుమారుగా 6 నుండి 8 గ్రామాలకు, 7000 నుండి 12,000 మంది రైతులకు ఒక్క ఏఈఓ మాత్రమే ఉన్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 600 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన రైతు వేదికలు సరేనా యాజమాన్యం చేసే అటెండర్లు లేక అతికొద్ది కాలంలోనే శిథిలావస్థకు చేరుకోనున్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం రైతు వేదికలలో సుమారు 5 లక్షల రూపాయలు రచించి రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలకు, రైతులకు మధ్య ముఖాముఖి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అలాగే నిరంతరం రైతు వేదికలలో ఏదో ఒక సభలు సమావేశాలు జరుగుతూ ఉంటాయి. ఈ సభలు సమావేశాలలో సభా స్థలం ఏర్పాటు చేయడం, రైతు అధికారులు పరిశుభ్రంగా ఉంచడంలో ఏఈఓలకు చేదోడు వాదోడుగా ఉండేందుకు అటెండర్లను నియమించకపోవడం వల్ల రైతు వేదికలలో సమావేశాలు నిర్వహించినపుడల్లా ఏఈవోలు తీవ్రమైన అసౌకర్యానికి గురవుతున్నట్లుగా పలుమార్లు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టుగా తెలిపారు. అలాగే గ్రామస్థాయిలో ఎలాంటి సహాయకులు లేకుండా ఎన్నో కష్టాలకోర్చి 8 నుండి 10 గ్రామాలలో సుమారు 49 రకాల విధులను నిర్వర్తిస్తూ తీవ్రమైన పనిభారాన్ని మోస్తున్నామని, ఇప్పటికైనా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ప్రతీ రైతు వేదికకు ఒక అటెండర్ ను నియమించడంతోపాటు భారత వ్యవసాయ మండలి సూచనల మేరకు ప్రతి గ్రామానికి ఒక గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించి తెలంగాణలో వ్యవసాయ శాఖను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ముందడుగు వేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ క్రాప్ సర్వేను కేంద్ర ప్రభుత్వ యొక్క మార్గదర్శకాలకు అనుగుణంగానే గ్రామస్థాయిలో లోకల్ యూత్ ద్వారా కానీ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా గాని పంటల సర్వే చేపిస్తే వ్యవసాయ శాఖ తరపున సర్వేను 100శాతం విజయవంతం మానిటర్ చేస్తామని ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖలో ఔట్సోర్సింగ్ ఏఈఓలను ఉన్నతాధికారులు వేధించడం ఆపాలని పునర్ అధికారులను వేడుకున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే విషయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వ్యవసాయ విస్తరణ అధికారులతో శాంతియుత వాతావరణంలో చర్చలు జరిపి, డిజిటల్ క్రాప్ సర్వేను రాష్ట్రంలో విజయవంతంగా చేపట్టుటలో సహకరించాలని కోరారు.





## తెలంగాణలో తుఫాను ముప్పు

**ప్రజానావ, ఖైరతాబాద్:**
తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉత్తర అండమాన్ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని.. దాని ప్రభావంతో రాగల 24గంటల్లో తూర్పు మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర అండమాన్ ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ నెల 22 నాటికి పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ బలపడి వాయుగుండంగా మారుతుందని పేర్కొంది. 23వ తేదీ నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై తుఫానుగా మారుతుందని పేర్కొంది. ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరానికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం ఉత్తర తమిళనాడు తీరప్రాంతంలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుందని.. ఎత్తుకు వెళ్లే కొలది నైరుతి దిశగా వంగి ఉందని వివరించింది. ఈ క్రమంలో రాష్ట్రంలో ఆదివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలుపడేందుకు అవకాశం ఉందని వివరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. అలాగే, ఈ నెల 25 వరకు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం చెప్పింది.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

### టీఆర్టీయూటీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షులు సుంకరి కృష్ణ

**ప్రజానావ, మెదక్:**
నూతన పీఆర్టీయూ టీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం మెదక్ జిల్లా పీఆర్టీయూ అధ్యక్షులు సుంకరి కృష్ణ అధ్యక్షతన ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సుంకరి కృష్ణ మాట్లాడుతూ 317 జీవోలో నష్టపోయిన ఉపాధ్యాయులను తిరిగి వారి సొంత జిల్లాలకు పంపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల పెండింగ్లో ఉన్న ఐదు డీఏలతో పాటు త్వరితగతిన పీఆర్సీని ఇప్పించాలని ట్రాన్స్‌ఫర్ కోరుకున్న ఉపాధ్యాయులను వారి సొంత పాఠశాలకు పంపించేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ అంశంపైన కూడా దృష్టి పెట్టి పాత పెన్షన్ విధానం వర్తింపజేసేలా కార్యాచరణ ప్రకటించాలన్నారు. కేజీబీవీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్, రాష్ట్ర, జిల్లా సభ్యులు వెంకట్రామిరెడ్డి, దుర్గయ్య, బసవరాజ్, దుర్గయ్య, మల్లారెడ్డి, మీరా, సత్యనారాయణరెడ్డి, మహిళా విభాగం నాయకురాలు స్వరూప రాణి, జ్యోతి, మహేష్ కుమార్, దీప అంజిబాబు, అమీరుద్దీన్, సంతోష్ కుమార్, చంద్రశేఖర్, హరిబాబు, రాజు, నరేందర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, యాదవ రెడ్డి, సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలు



**ప్రజానావ, శామీర్‌పేట్:**
రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలు శనివారం బోడుప్పల్‌లోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఆయనకు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, అలియాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి, అనంతరం గ్రామ మాజీ ఎంపీటీసీ ముద్దం అఖిలేష్ రెడ్డి, సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్ గౌడ్ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇంటి నుంచి వెళ్లిన కొద్ది సేపటికే బలవన్మరణం

**ప్రజానావ, శామీర్‌పేట్:**
ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు కొద్ది సేపటికే ఆత్మహత్య చేసుకున్న ఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మజీద్ పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మజీద్ పూర్ గ్రామానికి చెందిన వినయ్ రాజు (23) ఆదివారం మధ్యాహ్నం బైక్ పై ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. అతను వెళ్లిన కొద్ది సేపటికి వినయ్ రాజు తండ్రి మజీద్ పూర్ లోని తన పొలం దగ్గరికి వెళ్లగా బైకు కనిపించింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతకగా హన్మల్ల కుంట పక్కన ఉన్న ఒక చెట్టుకి కరెంటు కేబుల్ తో ఉరివేసుకొని కనిపించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

## హామీలు అమలుచేయలేని ప్రభుత్వం గద్దె దిగాలి

### బీఆర్ఎస్ పార్టీ దౌల్తాబాద్ మండల అధ్యక్షులు సయ్యద్ రహిమొద్దీన్





**ప్రజానావ, దౌల్తాబాద్:**
రైతు వ్యతిరేక విధాల అవలంబిస్తూ రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా నిరంకుశ పాలన కొనసాగిస్తున్న రేవంత్ సర్కార్ తగిన మూల్యం చెల్లించక తప్పదని బీఆర్ఎస్ దౌల్తాబాద్ మండల అధ్యక్షులు సయ్యద్ రహీముద్దీన్ అన్నారు. ఆదివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, దుబ్బాక ఎమ్మెల్యేకొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అమలు కానీ హామీలను ఇచ్చి రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి దొంగ అబద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని వాళ్లు చెప్పిన హామీలనే అమలు చేయడానికి సాకులు చెప్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి రూ.15 వేల ఇస్తామని మోసం చేసిందన్నారు. ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఇంకా పూర్తి చేయలేదన్నారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని కేసీఆర్ ఎప్పుడు చెప్తుండే వాడని అలాంటి పాలననే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రైతును రాజును చేస్తే కాంగ్రెస్ పాలనలో రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసేంతవరకు ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అల్లి శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు బండారు దేవేందర్, సర్పంచ్ చిత్తారిగౌడ్, ఎంపీటీసి గన్నమనేని లక్ష్మి మోహన్ రావు, నవీన్ కుమార్, రైతు సమన్వయ కమిటీ మాజీ అధ్యక్షులు తుమ్మ స్టివన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు రాజేందర్, పట్టణ అధ్యక్షులు ఉమ్మడి నరసింహారెడ్డి, నాయకులు రవీందర్, సత్యనారాయణ, రామచంద్రారెడ్డి, అంజయ్య, చంద్రమౌళి, ఆంజనేయులు నాగరాజు, స్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## తీరనున్న దత్తాత్రేయ స్వామి భక్తుల ఇబ్బందులు

**ప్రజానావ, సిరిసిల్ల:**

రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయం బ్యాక్ వాటర్‌లో దత్తాత్రేయ స్వామి గుట్ట చుట్టూ పచ్చదనం సంతరించుకొని ద్వీపంలా చూపరులను ఆకట్టుకుంటుంది. అయితే గుట్టపైకి వెళ్లడానికి భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ బోటు ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు తీరనున్నాయి.

బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామం రాజరాజేశ్వర జలాశయ నిర్మాణంలో ముంపునకు గురైంది. గ్రామంలోని గుట్టపై దత్తాత్రేయస్వామి ఆలయం ఉంది. జలాశయంలో ముంపునకు గురికాక ముందు రోజూ ఆలయంలో నిత్య పూజలు, అభిషేకాలు నిర్వహించేవారు. ప్రతి పౌర్ణమి రోజు సామూహిక సత్యదత్త వ్రతాలు భక్తులు ఆచరించేవారు. ఏటా డిసెంబరులో మూడు రోజులు జయంత్యుత్సవాలు వైభవంగా జరుగుతుండేవి. జలాశయంలో నీటి నిల్వతో నిర్వాసితులకు తమకు కేటాయించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి తరలి వెళ్లారు. గుట్ట చుట్టూ బ్యాక్‌వాటర్ చేరింది. దీంతో గుట్టపై నిత్య పూజలు, అభిషేకాలు నిలిచిపోయాయి. జయంత్యుత్సవాల సందర్భంగా పర్యాటక శాఖ నుంచి బోట్లు తెప్పించడంతో అర్చకులు గుట్టపైకి మూడు రోజులు వెళ్లి పూజలు నిర్వహించగా, భక్తులు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.


**ఎంపీ హామీతో...**

గత ఏడాది జరిగిన జయంత్యుత్సవాల సందర్భంగా స్వామివారిని ఎంపీ హోదాలో ప్రస్తుత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల ఇబ్బందులను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆయనకు వివరించారు. శాశ్వతంగా బోటు ఏర్పాటు కోసం నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈమేరకు ఎంపీ నిధులు రూ.10.68 లక్షలు కేటాయించారు. దీంతో హైదరాబాద్‌లో బోటు తయారు చేయించి తీసుకొచ్చారు. త్వరలోనే కేంద్ర మంత్రి చేతుల మీదుగా బోటు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**జలాశయం బ్యాక్‌వాటర్‌లో బోటు**

దృష్టి సారిస్తే పర్యాటక కేంద్రంగా అభివృద్ధివేములవాడకరీంనగర్ ప్రధాన రహదారిలోని కొదురుపాక చౌరస్తా నుంచి బోయినపల్లి మార్గంలో వరదవెల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నుంచి జలాశయం బ్యాక్‌వాటర్ వరకు దారి ఉంటుంది. గుట్ట చుట్టూ ఎటు చూసినా కనుచూపు మేర నీళ్లు, గుట్ట చుట్టూ పచ్చదనం భక్తులను ఆకట్టుకుంటుంది. ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే వేములవాడలోని రాజన్న ఆలయానికి వచ్చే భక్తులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.





## ప్రజలు వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజానావ, సిరిసిల్ల:**

జిల్లా ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్, సుందరయ్య నగర్ లోని అర్బన్ పిహెచ్సిలను కలెక్టర్ ఆదివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా ఓపి, సిబ్బంది రిజిస్టర్, రక్త పరీక్షల ల్యాబ్, ఇన్ పేషెంట్ గదులు ఆసుపత్రి ఆవరణ, మందులను పరిశీలించి పరిశీలించారు. అనంతరం దవాఖానాలో ఉన్న పలువురు రోగులతో మాట్లాడారు.అంబేద్కర్ నగర్ అర్బన్ పిహెచ్సి పరిధిలో గత నెలలో ఎన్ని కాన్పులు అయ్యాయో వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు 18 డెలివరీలం అయ్యాయని ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ పలువురు బాలింతలతో ఫోన్లో మాట్లాడారు. ఎక్కడ ఆస్పత్రి లో డెలివరీ అయ్యారు? పాప అలాగే బాలింత ఆరోగ్య సమాచారాన్ని ఆరాతీశారు. అలాగే డెలివరీకి సమయం ఉన్న గర్భిణులతోనూ ఫోన్లో మాట్లాడారు. ఆస్పత్రిలో అందిస్తున్న సేవలు, మందుల వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని, ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకునేలా అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. సహజ కాన్పులు అయ్యేలా గర్భిణులకు సలహాలు, సూచనలు శిక్షణ అందించాలని ఆదేశించారు.ఇక్కడ వైద్యాధికారి కృష్ణవేణి, ఆయా అర్బన్ పి హెచ్ సీ ల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సన్న ధాన్యం మిల్లింగ్‌కు ససేమిరా

**ప్రజానావ, వేములవాడ:**

ఉమ్మడి జిల్లాలోని మిల్లర్లు సన్న ధాన్యం మిల్లింగ్‌కు ససేమిరా అంటున్నారు. క్వింటాకు 67 శాతం బియ్యం ఇవ్వలేమని చేతులెత్తేస్తున్నారు. మిల్లింగ్ నిబంధనలు సడలించి క్వింటాకు కొంత పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ.. ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్‌కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతుండగా మిల్లర్ల మెలికతో సన్నధాన్యం సేకరణ చిక్కు సమస్యగా మారనుంది.



**దిగుబడి ఇలా..**

ఉమ్మడి జిల్లాలో వానాకాలం సీజన్‌లో 11.75 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. 20.59 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనాకొచ్చారు. ఇందుకోసం 1,360 కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈసారి 31 రకాల సన్నధాన్యాన్ని పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మునుపెన్నడూ లేని విధంగా వానాకాలం సీజన్‌లో అత్యధిక శాతం సన్నాలు సాగు చేశారు. ఉమ్మడి జిల్లాలో 3,90,967 ఎకరాల్లో సన్నాలు సాగైంది. కరీంనగర్ జిల్లాలో 2,48,623 మెట్రిక్ టన్నులు, జగిత్యాలలో 1,72,150 మెట్రిక్ టన్నులు, పెద్దపల్లిలో 3.44 లక్షల మెట్రిక్ టన్నులు, రాజన్న సిరిసిల్లలో 28,457 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాకొచ్చారు. మొత్తంగా 7.93 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని ప్రత్యేక కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు అంతా సిద్ధం చేశారు. సన్నాలకు కేంద్రం క్వింటాకు రూ.2,320 మద్దతు ధర చెల్లిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ కలిపి రూ.2,820 చొప్పున కొనుగోలు చేయనుంది. దొడ్డు ధాన్యంతో వచ్చే బియ్యాన్ని ఎఫ్‌సీఐ (భారత ఆహార సంస్థ)కు వెళతాయి. కొనుగోలు కేంద్రాలకు వచ్చే సన్నధాన్యాన్ని మిల్లింగ్ చేశాక వచ్చే బియ్యాన్ని వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు, సంక్షేమ వసతి గృహాలకు ఉపయోగించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. కానీ సన్న ధాన్యం మిల్లింగ్‌కు మిల్లర్లు ససేమిరా అనడంతో ఈ సమస్య కొలిక్కి వచ్చిన తర్వాతే సన్నధాన్యం కొనుగోలు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. నిబంధనలు సడలించాలని రారైస్ మిల్లర్స్ అసోయేషన్ అధ్యక్షుడు తనుకు సురేశ్ తదితరులు కోరుతున్నారు.

**ఇదీ సమస్య**

సాధారణంగా దొడ్డు రకం ధాన్యం మిల్లింగ్ చేస్తే క్వింటాకు 67 కిలోల బియ్యం వస్తాయి. అదే సన్న రకం ధాన్యం మిల్లింగ్ చేస్తే 57 కిలోలకు మించి బియ్యం రావని మిల్లర్లు అంటున్నారు.

దొడ్డు, సన్నాలకు చెందిన ఏ రకం ధాన్యం మిల్లింగ్ చేసినా క్వింటాకు రూ.67 కిలోల బియ్యం సీఎంఆర్ కింద అప్పగించాలని ప్రభుత్వం అంటుందని చెబుతున్నారు.

సన్నరకాలను తీసుకొని మిల్లింగ్ చేస్తే క్వింటాకు 10 కిలోల బియ్యం తక్కువగా వస్తుందని, ఈ లోటును ఎవరు భరిస్తారని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు.

పైగా 17 శాతం తేమ ఉన్న సన్నరకం ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటే 20 రోజుల్లో రంగు మారిపోయే ప్రమాదం ఉందని, ఇవే బియ్యాన్ని మిల్లింగ్ చేస్తే బియ్యం తీసుకునే సమయంలో నాణ్యత లేదంటూ అధికారులు కొర్రీలు పెడితే తాము నష్టపోతామని వాపోతున్నారు.

అందుకే తేమ నిబంధనను 17 నుంచి 14 శాతానికి తగ్గించాలని.. సన్న బియ్యం సరఫరాలో క్వింటాకు రూ.300 పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్‌కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు.

క్వింటాకు ఎన్ని కిలోల బియ్యం వచ్చినా తీసుకునేలా నిబంధన సడలించాలని కోరుతున్నారు.

దీంతోపాటు 20 ఏళ్లుగా మిల్లింగ్ ఛార్జీలు పెంచకపోవడంతో అనేక సమస్యల తమను వేధిస్తున్నాయని అంటున్నారు.

రారైస్ క్వింటాకు రూ.30 చెల్లిస్తున్నారని, పెరిగిన విద్యుత్తు ఛార్జీలు, కార్మికుల కూలీలు కలిపితే తమకు అసలే గిట్టుబాటు కావడం లేదంటున్నారు.



## కుటుంబ సమేతంగా రాజన్న ను దర్శించుకున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ప్రజానావ, సిరిసిల్ల:**

ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం కుటుంబ సమేతంగా వేములవాడ రాజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసుకొన్న అనంతరం కల్యాణ మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేశారు.వీరి వెంట ప్రోటోకాల్ ఏఈఓ జీ రమేష్ ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు ప్రోటోకాల్ పర్యవేక్షకులు అశోక్ ప్రోటోకాల్ ఇంచార్జ్ ఎడ్ల శివ సాయి ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ టౌన్ సీఐ వీర ప్రసాద్ ఉన్నారు.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదు

**కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్**



**ప్రజానావ, వేములవాడ:**

వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములవాడ పట్టణ పరిధిలో పలువురుకి మంజూరు అయిన 11 లక్షల 38 వేల 500 విలువగల 36 ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను స్థానిక నాయకులతో కలసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు అందజేశారు.. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని వేస్తుందని. ఇందులో భాగంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షల పెంచడం జరిగిందని తెలిపారు.. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో ఆరోగ్యపరంగా అత్యవసర చికిత్స నిమిత్తం పలువురి కి ఎల్ ఓ సి లను అనారోగ్యంతో చికిత్స తీసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు..

వేములవాడ పట్టణంతోపాటు నియోజకవర్గ అభివృద్ధి కేవలం ఆది శ్రీనివాస్ తోనే సాధ్యమని అన్నారు.అలాగే టిఆర్ఎస్ బిజెపి పార్టీ నాయకులు ఎమ్మెల్యే ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ పై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను ఖండించారు.. మరోసారి ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని వారు అన్నారు..

## 2 కిలోమీటర్లు.. 20 నిమిషాలు



**ప్రజానావ, కరీంనగర్:**

అసలే ఇరుకు.. ఆపై గుంతలు.. మధ్యలో దారిపైకి చేరుతున్న వరద.. వెరసి రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణానికి 20 నిమిషాల సమయం పడుతోంది. మంథని మండలం సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీ వరకు రహదారి పూర్తిగా అధ్వానంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటేనే వాహన చోదకులు హడలిపోతున్నారు. వాహనాలు గుంతల్లో పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పది రోజుల్లో గుంతలు పూడ్చివేస్తామని సింగరేణి జీఎం హామీ ఇచ్చి 20 రోజులవుతున్నా అమలుకు నోచుకోలేదు.

**రోడ్డుపైకి వాగు నీరు**

సింగరేణి సంస్థ పదేళ్ల కిందట మంథని మండలం బిట్టుపల్లి శివారులో అసైన్డ్ భూమిని సేకరించింది. రచ్చపల్లి, అక్కెపల్లి, లద్నాపూర్ గ్రామాల ప్రజలు నిర్వాసితులుగా మారగా రచ్చపల్లి పునరావాస కాలనీ పేరిట ఇళ్లు నిర్మించి, వసతులు కల్పించింది. సూరయ్యపల్లి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కాలనీ వరకు గతంలో మట్టి రోడ్డు ఉండేది. పునరావాసకాలనీ నిర్మాణ సమయంలో రూ.2 కోట్లతో ఒక వరుస తారు నిర్మించారు. మంథని మండలం బిట్టుపల్లి, ధర్మారం, గోపాల్‌పూర్, చిన్నఓదాల, ముత్తారం మండలం సీతంపల్లి, ఖమ్మంపల్లి, జిల్లెల్లపల్లి గ్రామాల ప్రజలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తారు.

పునరావాస కాలనీ నిర్మాణానికి ముందు నిత్యం 20 వాహనాలు నడిచేవి. ఏడాది కిందట ఖమ్మంపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల మధ్య మానేరుపై వంతెన అందుబాటులోకి రావడంతో నిత్యం వందలాది వాహనాలు నడుస్తున్నాయి.

ఈ మార్గంలో జనగలంత వాగు కాలువ నీటితో పాటు బిట్టుపల్లి పెద్దచెరువు మత్తడి నీరు రహదారిపై ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.అసలే ఒక వరుస రహదారి కాగా పలు చోట్ల మలుపులు ప్రమాదకరంగా మారాయి. కాజ్‌వే వద్ద వంతెన నిర్మాణంతో పాటు రహదారిని రెండు వరుసలుగా నిర్మించాల్సి ఉంది.

**రహదారిపై గుంతలు**

**ప్రభుత్వానికి అప్పగించని సింగరేణి**

సింగరేణి భూ నిర్వాసితుల కోసం సంస్థ యాజమాన్యం ఈ రహదారిని నిర్మించింది. పంచాయతీరాజ్ లేదా ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించకపోవడంతో రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు కావడం లేదు. పునరావాస కాలనీ కోసం నిర్మించినందున సింగరేణి సంస్థ మరమ్మతులు చేపట్టాలని రచ్చపల్లి గ్రామస్థులు కోరుతున్నారు. ఒక వరుస దారి కావడంతో ఎదురుగా వాహనం వస్తే వెళ్లడం కష్టమవుతోందని, వాహనాల రద్దీకి అనుగుణంగా రెండు వరుసలుగా విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు.

## చోరీలు పరిపాటి.. రికవరీ ఏపాటి?

**ప్రజానావ, జగిత్యాల:**

జగిత్యాల జిల్లాలో మూడు నెలలుగా చోరీలు పెరిగాయి. ఇళ్లతో పాటు చిన్న ఆలయాలు, దుకాణాల్లోకి చొరబడుతూ దొంగలు అందిన కాడికి దోచుకెళ్తున్నారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో ఈ ఏడాది ఇప్పటివరకు 302 చోరీలు జరిగాయి. సగటున రెండు రోజులకో కేసు నమోదైంది. సిరిసిల్ల జిల్లాలోనూ అడపాదడపా చోరీ ఘటనలపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వెయ్యికి పైగా కేసుల్లో దొంగలు చేతివాటం చూపారు.ఈ ఏడాది జులై 7న పట్టపగలే అలుగునూరులో రాజీవ్ రహదారికి ఆనుకుని ఉన్న ఇంట్లో దొంగలు పడ్డారు. తాళం పగులగొట్టి లోనికి చొరబడిన దొంగలు 8 తులాల బంగారు ఆభరణాలు సహా రూ.46 వేలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో పరిశీలించిన పోలీసులు, క్లూస్ టీం సభ్యులు ఇప్పటివరకూ దొంగలను గుర్తించలేదు. రెండు, మూడు రోజులు హడావుడి చేసి ఆ తర్వాత వదిలేశారు. బాధితులు మాత్రం ఠాణా చుట్టూ తిరుగుతున్నారు.కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 2022లో అన్ని రకాల చోరీలు కలిపి 248 కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ ఎఫ్ఐఆర్‌లు నమోదైనవి. కేసు కాకుండా బాధితులు వెనుదిరిగినవి మరో 200 వరకుంటాయి. 2023లో 330 చోరీలు జరిగాయి. ఈ ఏడాది ఇప్పటివరకే ఆ సంఖ్య 300 దాటింది. గతేడాది రూ.2 కోట్ల విలువైన సొత్తు చోరీకి గురి కాగా పోలీసులు రూ.94,91,786ను మాత్రమే తిరిగి స్వాధీనం చేసుకోగలిగారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతేడాది నమోదైన 327 కేసుల్లో 158 మాత్రమే ఛేదించారు. రూ.1.58 కోట్లు పోగా రూ.59.70 లక్షలు బాధితులకు ఇప్పించగలిగారు. రూ.కోటి వరకు రికవరీ కాలేదు. అంతకుముందు ఏడాది (2022)లో 114 ఘటనల్లో దొంగలు పట్టుబడ్డారు. 121 కేసుల అతీగతి లేదు. రూ.45.04 లక్షలు మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది 200 వరకు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

పెద్దపల్లి జిల్లాలో 2022లో 679 చోరీలు జరిగాయి. బాధితులు రూ.4.47 కోట్లు పోగొట్టుకోగా రూ.59.21 లక్షలు మాత్రమే తిరిగి ఇప్పించగలిగారు. గతేడాది 725 ఎఫ్ఐఆర్‌లు నమోదై రూ.1.99 కోట్లు పోగా రూ.40.99 లక్షలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల జిల్లాలో గతేడాది 113.2 తులాల బంగారు ఆభరణాలను, 1508 తులాల వెండి ఆభరణాలను బాధితులకు అందించగలిగారు. మరో 80 తులాల ఆభరణాలను రికవరీ చేయాల్సి ఉంది.

పోయింది ఎక్కువ.. ఫిర్యాదులో తక్కువ

చోరీ ఘటనల్లో బాధితులు ఎక్కువ మొత్తం పోగొట్టుకున్నా పోలీసులు వారితో తక్కువ మొత్తాన్ని ఫిర్యాదుల్లో రాయిస్తున్నారు. రూ.లక్ష కన్నా ఎక్కువ ఉండకుండా చూస్తున్నారు. పెద్ద కేసులపై దృష్టి సారిస్తూ చిన్న చోరీ ఘటనల విషయంలో ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. ఆలయాల్లో దొంగతనాలు జరిగినప్పుడు తక్కువ మొత్తంలో సొత్తు పోయినట్లు నమోదు చేస్తున్నారు. రికవరీ అయినప్పుడు పూర్తిగా ఇప్పిస్తామని బాధితులను ఒప్పించి ఫిర్యాదులు రాయిస్తున్నారు. ఇక రూ.వేలల్లో పోయిన సొత్తుకైతే కేసులే నమోదు చేయడం లేదనే ఆరోపణలున్నాయి.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చోరీలు పెరుగుతున్నాయి. పాత, కొత్త నేరస్తులపై నిఘా పెట్టండి. సొత్తు రికవరీలో మీరెందుకు వెనుకబడ్డారు? నేరగాళ్ల పట్టివేతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి. చోరీలను నిలువరించండి.



# కిచ్చా సుదీప్‌కు మాతృవియోగం

కన్నడ నటుడు కిచ్చా సుదీప్ ఇంట తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆయన తల్లి సరోజా సంజీవ్(86) ఆదివారం కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో కొన్ని రోజులుగా బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఈరోజు ఉదయం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు సుదీప్‌ను పరామర్శించారు. ఆమె మృతి పట్ల సంతాపం ప్రకటించారు. 'ప్రముఖ నటుడు కిచ్చా సుదీప్ మాతృమూర్తి కన్నుమూశారని తెలిసి చింతించాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. తన నట జీవితంపై తల్లి ప్రభావం, ప్రోత్సాహం ఉందని సుదీప్ ఎన్నోసార్లు తెలిపారు. మాతృ వియోగం నుంచి ఆయన త్వరగా కోలుకోవాలి. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని ఏపీ ఉప సీఎం పవన్‌కల్యాణ్ పోస్ట్ పెట్టారు. అభిమానులు సైతం సంతాపం తెలియజేస్తున్నారు.



# 'పుష్ప-2' శ్రద్ధా.. ఐటమ్ సాంగ్

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, క్రియేటివ్ జీనియస్ సుకుమార్ కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం 'పుష్ప 2'. ప్రస్తుతం మూవీ షూటింగ్ చివరి దశలో ఉంది. ఓ సాంగ్, కొంత మేర క్లైమాక్స్ షూట్ మినహా మిగతా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా డిసెంబరు 6న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కానుంది. కాగా. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ నెట్టింట హల చల్ చేస్తోంది. సుకుమార్ సినిమాలో ఓ ఐటెం సాంగ్ కు విపరీతమైన క్రేజ్ ఉంటుంది. పుష్పలోని 'ఊ అంటావా మావా సాంగ్' ఎంత హిట్ అయిందో చూశాం. ఇప్పుడు రాబోతున్న పుష్ప–2 లోను ఐటం సాంగ్ ను ప్లాన్ చేశాడట సుక్కు. ఈ ఐటెం సాంగ్ కోసం మేకర్స్, బాలీవుడ్ స్టార్ బ్యూటీ శ్రద్ధా కపూర్‌ని తీసుకున్నారని తెలుస్తోంది. ఈ సాంగ్ కోసం శ్రద్ధా ఏకంగా రూ.4 కోట్ల రెమ్యునరేషన్ ఇచ్చినట్టు టాక్ నడుస్తుంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సిఉంది.



# సాయి పల్లవితో సినిమా చేయాలనుంది

హీరోయిన్ సాయిపల్లవిపై లెజండరీ డైరెక్టర్ మణిరత్నం పొగడ్తల వర్షం కురిపించారు. కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ హీరోగా, నేచురల్ బ్యూటీ సాయిపల్లవి హీరోయిన్‌గా తెరకెక్కిన తాజా చిత్రం 'అమరన్'. బయోగ్రాఫికల్ యాక్షన్ ఫిల్మ్‌గా రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది.తాజాగా చెన్నైలో ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మణిరత్నం మాట్లాడుతూ.. తాను సాయిపల్లవికి పెద్ద అభిమానిని చెప్పారు.ఆమెతో సినిమా చేయాలనుంది. తప్పకుండా చేస్తా' అని అన్నారు. ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మణిరత్నం దర్శకత్వంలో నటించాలని హీరోయిన్లందరూ కలలు కంటుంటారు. కానీ, ఓ హీరోయిన్ తో పనిచేయాలనుందని మణిరత్నం చెప్పటం విశేషం.



# 26న 'కంగువ' ఆడియో రిలీజ్



తమిళ స్టార్ హీరో సూర్య నటించిన చిత్రం 'కంగువా'. సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు శివ దర్శకత్వంలో తెరకెక్కింది. పాన్ ఇండియా బాషలలో అత్యంత భారీ బడ్జెట్ పై స్టూడియో గ్రీన్ బ్యానర్ పై నిర్మించారు. సూర్య సరసన దిశా పఠానీ కథానాయికగా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ విలన్ గా నటిస్తున్నాడు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా నవంబరు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. దీంతో మేకర్స్ కంగువ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. అందులో భాగంగా ముంబై లో కంగువ టీమ్ మీడియాతో ముచ్చటిం,ఆనే. ఇక, అక్టోబర్ 26న చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్ నిర్వహిస్తున్నట్టు వీడియో రిలీజ్ చేస్తూ ప్రకటించారు. ఈ ఈవెంట్ కు ముఖ్య అతిదిగా తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ రానున్నట్టు వార్తలు వచ్చాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 882/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2523, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. Editor: Adula Thirupathi. Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657